క్లుప్తంగా

పెద్దవూర తహసీల్దార్‌గా సరోజ బాధ్యతల స్వీకరణ


సరోజ

పెద్దవూర: మండల తహసీల్దార్‌గా సాంబల సరోజ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన సురిగి సైదులుగౌడ్ సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు బదిలీ కాగా.. కొన్నిరోజులు నాయబ్ తహసీల్దార్ కట్టా వెంకటరంగారెడ్డికి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. వెంకటరంగారెడ్డికి సైతం తహసీల్దార్‌గా పదోన్నతి లభించడంతో ఈ నెల 11న ఆయన ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యి రంగారెడ్డి జిల్లాకు వెళ్లారు. కాగా మేడ్చల్ జిల్లా కీసర తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన జి. దివ్యారెడ్డిని పదోన్నతిపై పెద్దవూర తహసీల్దార్‌గా బదిలీ చేయగా ఆమె కొండమల్లేపల్లి తహసీల్దార్‌గా విధుల్లో చేరారు. దీంతో హైదరాబాద్ కలెక్టరేట్‌లో భూసేకరణ విభాగంలో నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సరోజ పదోన్నతిపై ఇక్కడికి వచ్చి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్

పెద్దవూర: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర కళాశాలలో 2023 – 24 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 24న స్పాట్ అడ్మిషన్ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీలో మొత్తం 12 (ఒకటి ఎస్సీ, 11 ఎస్టీ) ఖాళీలు, బైపీసీలో 16 సీట్లు (ఎస్టీలకు మాత్రమే) ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 24వ తేదీ మండల కేంద్రంలోని గురుకుల కళాశాల కార్యాలయంలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్‌కు హాజరుకావాలని సూచించారు.

ముదిరాజ్ కులస్తులపై చిన్నచూపు తగదు

పెద్దవూర: ముదిరాజ్ కులస్తులను చిన్నచూపు చూస్తున్న సీఎం కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు ఈద వెంకటేష్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో ముదిరాజ్ మహాసభ మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గానికి బీఆర్‌ఎస్ పార్టీ ఒక్క ఎమ్మెల్యే టిక్కెట్ కూడా కేటాయించకపోవడం సరికాదన్నారు. సమావేశంలో బీసీ విద్యార్థి నాయకుడు జోగు రమేష్‌ముదిరాజ్, పిడిగం రామకృష్ణ, చిన్ని, గుర్రం శంకరయ్య, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక


జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పెద్దవూర మండలం గర్నెకుంట గ్రామస్తులు

నాగార్జునసాగర్: పెద్దవూర మండలం గర్నెకుంట గ్రామానికి చెందిన 20 కుటుంబాలు మంగళవారం చెరుకుపల్లి దుర్గయ్య, కొట్టె శంకర్ ఆధ్వర్యంలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను వీడి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఆయన తనయుడు కుందూరు జయవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో గల తన నివాసంలో జానారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌తోనే బలహీన వర్గాలకు మేలు జరుగుతుందనే నమ్మకంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఆర్థికసాయం పార్టీలకతీతంగా ఇవ్వాలి

పెద్దఅడిశర్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకతీతంగా బీసీలకు ఆర్థికసాయం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పల్లె సత్యనారాయణగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో 1350 మంది బీసీ ఆర్థికసాయానికి ఆరఖాస్తు చేసుకోగా కేవలం 45 మంది బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలనే ఎంపిక చేశారని ఆరోపించారు. ప్రభుత్వం పార్టీలకతీతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో బొల్లిగోర్ల లింగయ్యయాదవ్, శివయ్యచారి, నారాయణదాసు నగేష్, కుడికిళ్ల శ్రీను, నిరంజన్ తదితరులున్నారు.

పీఆర్‌సీ కమిటీ నియమించాలి

శాలిగౌరారం: ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిటీని నియమించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మొదటి పీఆర్‌సీ గడువు ముగిసినప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకాలేదని, రెండో పీఆర్‌సీ కమిటీ నేటికీ నియామకం కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేతన సవరణ కమిటీని నియమించి ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, రాకేశ్, రాములు, రఫీ, శంకర్, రవికుమార్, లింగారెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగానే గ్రామసభలు

- ప్రజలను భాగస్వాములుగా చేయడంలో విఫలం
- కేవలం పాలకవర్గ సభ్యులే హాజరు
- పట్టించుకోని అధికారులు


తిరుమలగిరి గ్రామపంచాయతీ కార్యాలయం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించే గ్రామసభలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల తీరు, లబ్ధిదారుల వివరాలను గ్రామసభల్లో గ్రామస్తులకు వివరించాలి. పంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులతో పాటు పూర్తయిన పనుల వివరాలను కూడా గ్రామసభలో చర్చించాలి. కానీ మండలంలోని ఆయా పంచాయతీల్లో ఈ నిబంధనలు ఎక్కడా పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నామమాత్రంగా నిర్వహించే సమావేశాలు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు మాత్రం ఇవేమీ పట్టించుకోవడం లేదని అంటున్నారు.

నిబంధనలు పాటించకపోవడంతో..

తిరుమలగిరి మండలంలో మొత్తం 34 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గ్రామసభ నిర్వహించే తేదీకి ఒకరోజు ముందే గ్రామంలో దండోరా వేయించాలి. నిబంధనల ప్రకారం గ్రామసభకు గ్రామంలోని జనాభా దామాషా ప్రకారం కనీసం 20శాతం మంది అయినా హాజరయ్యేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలి. సభలో సమస్యలతో పాటు పంచాయతీ ఆదాయ, వ్యయాలకు సంబంధించిన నివేదికను చదివి వినిపిస్తారు. కానీ మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ నిబంధనలు ఏవీ పాటించకపోవడంతో గ్రామపంచాయతీల్లో ఏమేమి పనులు జరుగుతున్నాయో కూడా గ్రామస్తులకు తెలియడం లేదు.

కేవలం పాలకవర్గ సభ్యులే..

గ్రామసభల్లో ఆయా గ్రామాల పాలకవర్గ సభ్యులే తప్ప గ్రామస్తులు ఎక్కడా కనిపించడం లేదు.అధికారులు కూడా ప్రజలకు గ్రామసభ సమాచారాన్ని తెలియజేయకపోవడం, సభలో ప్రస్తావించే ఏ సమస్యకు పాలకమండలి పరిష్కారం చూపకపోవడంతో ప్రజలు సైతం గ్రామసభలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. సభకు వెళ్లినా ఏం ప్రయోజనం అనే భావనలో ప్రజలు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామసభల్లో అందరిని భాగస్వామ్యం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దండోరా వేయిస్తున్నాం



గ్రామసభలకు సమావేశాలకు ఆయా గ్రామాల ప్రజలు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే. మండల వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో ఒక రోజు ముందే దండోరా వేయిస్తున్నాం. ఒకటి, రెండు సార్లు గ్రామస్తులు రాకుంటే వాయిదా వేస్తున్నాం. మూడోసారి కూడా రాకున్నా నిర్వహించాలి కాబట్టి తప్పని పరిస్థితుల్లో గ్రామసభ నిర్వహిస్తున్నాం. పనుల కారణంగా ప్రజలు సమావేశాలకు రావడం లేదు.

– పద్మ, ఎంపీఓ, తిరుమలగిరి

రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి

దేవరకొండ: హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో గిరిజన మహిళపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి తీవ్రంగా కొట్టడాన్ని ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బాధిత మహిళకు ప్రభుత్వం రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళపై థర్డ్ డిగ్రీని ప్రయోగించిన పోలీసులను ప్రభుత్వం వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని, హోం మంత్రిని బర్తరఫ్ చేయాలని అన్నారు. బాధిత మహిళకు బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు. సమావేశంలో లాలునాయక్, అంకూరి నర్సింహ, ఏటి కృష్ణ, కళ్యాణ్‌నాయక్, గుండాల అంజయ్య, నరేందర్‌రెడ్డి, శంకర్, తిరుపతిగౌడ్, రాజు తదితరులున్నారు.

కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు రూ.10లక్షల ఆర్థికసాయం


ఆపరేషన్ అనంతరం చికిత్స పొందుతున్న సాజీద్

నాగార్జునసాగర్: ఓ యువకుడి కిడ్నీ ఆపరేషన్‌కుగాను పెద్దవూర మండలంలోని వెల్మగూడెం గ్రామానికి చెందిన దాచిరెడ్డి వెంకటనర్సింహారెడ్డి(డీవీఎస్ రెడ్డి) రూ.10లక్షలు ఆర్థికసాయం చేశారు. వివరాలు.. నల్లగొండ పట్టణానికి చెందిన మహ్మద్ అబ్దుల్ హలీం సాజీద్ అనే వ్యక్తికి రెండు కిడ్నీలు చెడిపోయాయి. అతడి తల్లి ఒక కిడ్నీ ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. కాగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్ కోసం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో సంప్రదించగా రూ.11లక్షలు ఖర్చవుతాయని పేర్కొన్నారు. ఇది తెలుసుకున్న నందికొండ మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్ణ బ్రహ్మానందరెడ్డి విషయాన్ని దాచిరెడ్డి వెంకటనర్సింహారెడ్డికి తెలియజేశారు. దీంతో డీవీఎస్ రెడ్డి తన తండ్రి దాచిరెడ్డి మాధవరెడ్డి జ్ఞాపకార్థం రూ.10లక్షలు ఆర్థికసాయం అందజేశారు. మిగిలిన రూ.లక్ష బ్రహ్మానందరెడ్డి ఇవ్వడంతో సాజీద్‌కు కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేశారు. తనకు సహాయం చేసిన డీవీఎస్ రెడ్డి, కర్ణ బ్రహ్మానందరెడ్డిలకు సాజీద్, అతడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఘజియాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అతుల్ గార్గ్

అడవిదేవులపల్లి: వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అతుల్ గార్గ్ అన్నారు. మంగళవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని వాసవి కల్యాణ మండపంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బాణావత్ రతన్‌సింగ్‌నాయక్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సీతారాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దింటి ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు రవీందర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సైదులు, ఎస్టీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ శ్రీనునాయక్ తదితరులున్నారు.

మొల్కపట్నం వాసికి ఇన్‌కం ట్యాక్స్ ఆఫీసర్ ఉద్యోగం


సురేష్

వేములపల్లి: మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన రాయికింద సురేష్ ఇన్‌కం ట్యాక్స్ ఆఫీసర్‌గా కొలువు సాధించాడు. రాయికింది శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు నరేష్ డిగ్రీ చదివి మిర్యాలగూడలోని ప్రైవేట్ ట్రావెల్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు బీటెక్ పూర్తిచేసి గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నాడు. మూడు నెలల క్రితం రైల్వే గ్రూప్–డి ఉద్యోగం సాధించి గుంటూరు రైల్వే డివిజన్‌లో పనిచేస్తుండగానే.. ఇటీవల విడుదలైన స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్‌ఎస్‌సీ) ఫలితాల్లో జాతీయ స్థాయిలో 1190వ ర్యాంకు సాధించి ఇన్‌కం ట్యాక్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. సురేష్ ఉన్నత ఉద్యోగం సాధించడంతో అతడి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామస్తులు సురేష్‌ను అభినందించారు.

మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు


దేవరకొండ: మంత్రికి మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్, చిత్రంలో ఎమ్మెల్యే కంచర్ల


హాలియా: మంత్రి జగదీష్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్

దేవరకొండ: రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని మంగళవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. దేవరకొండ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం కేసీఆర్ తన పేరును ప్రకటించడంతో ఆయన మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

హాలియా: హైదరాబాద్‌లో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సాగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు టికెట్ ఇచ్చినందుకు మంత్రి జగదీష్‌రెడ్డికి మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

దేవరకొండలో బీజేపీ జెండా ఎగురవేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న ఔరాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభు చౌహాన్

డిండి: వచ్చే ఎన్నికల్లో దేవరకొండ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ నాయకుడు, కర్ణాటకలోని ఔరాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభు చౌహాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ తెలంగాణ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం డిండి మండల పరిధిలోని సింగరాజుపల్లిలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ కార్యవర్గ సభ్యుడు లాలూనాయక్, దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ ఏటి.కృష్ణ, కళ్యాణ్‌నాయక్, సురేష్‌రావు, మోహన్, రాజు, రామకృష్ణ, సాయిగౌడ్, కిరణ్, రాములు, శ్రీను పాల్గొన్నారు.

జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలి

దేవరకొండ: జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని దేవరకొండ మండలంలోని మర్రిచెట్టుతండా సర్పంచ్ శ్రీనునాయక్ అన్నారు. మంగళవారం మర్రిచెట్టుతండా గ్రామ పంచాయతీలో రాష్ట్ర జీవవైవిధ్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో మాదిరిగా ప్రస్తుతం రైతులు రాగులు, సజ్జలు, జొన్నలు, కందులు వంటి పంటలు పండించి అధిక లాభాలు పొందాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శ్రవణ్‌కుమార్, కీర్తి, లక్ష్మి, గోరి, గ్రామస్తులు తదితరులున్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ప్రయాణికుల వినతి


ప్రయాణికులతో ఫోన్‌లో మాట్లాడుతున్న డీఎం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్‌కు పలువురు ప్రయాణికులు, ప్రజలు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు పలు సమస్యలను వివరించారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో నైట్ హాల్ట్ చేసే మిర్యాలగూడ డిపో బస్సుల్లో కొన్నింటిని మియాపూర్ వరకు పొడిగించాలని, మిర్యాలగూడ నుంచి కోదాడ వైపు వెళ్లే బస్సులను చిల్లేపల్లి స్టేజి వద్ద ఆపాలని, హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వచ్చే సూపర్ లగ్జరీ బస్సులు నల్లగొండకు వెళ్లకుండా నేరుగా మిర్యాలగూడకు వచ్చేలా చూడాలని, మిర్యాలగూడ నుంచి దేవరకొండకు వెళ్లే బస్సులు తుంగపహాడ్ స్టేజీ వద్ద నిలిపేలా చూడాలని పలువురు ప్రయాణికులు కోరారు. అదేవిధంగా మిర్యాలగూడ పట్టణంలో లోకల్ బస్సులు నడపాలని, మాడుగులపల్లి నుంచి పాములపహాడ్ మీదుగా మిర్యాలగూడకు బస్సులు నడిపించాలని కోరారు. అనంతరం డీఎం మాట్లాడుతూ.. ప్రయాణికుల రద్దీతో పాటు ఆదాయం వచ్చే గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడిపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి


హాలియా: కొత్తపల్లిలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి

హాలియా: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అనుముల మండలంలోని కొత్తపల్లి, పంగవానికుంట ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం కొత్తపల్లి గ్రామంలో ఏడు నిరుపేద కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా గ్రామంలో ఇంటింటికి పండ్ల మొక్కలు, జూట్ బ్యాగులు, లంచ్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుమలగిరి మండల వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు అంకతి వెంకటరమణ, సర్పంచులు శాగం శ్రావణ్‌కుమార్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నరేష్‌నాయక్, ప్రభావతీసంజీవరెడ్డి, ఉప సర్పంచ్ మట్టపల్లి ప్రదీప్‌రెడ్డి, తిరుమలనాథ ఆలయ చైర్మన్ బుర్రి రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

నిడమనూరులో..

నిడమనూరు: నిడమనూరు జెడ్పీహెచ్‌ఎస్‌తో పాటు మండలంలోని వెనిగండ్లలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుసిరెడ్డి పాండురంగారెడ్డి స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు అంకతి వెంకటరమణ, సర్పంచులు శ్రావణ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఉంకా కోటేష్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మండలంలోని మర్లగడ్డలో మంగళవారం అనుముల మధు–దివ్యలకు బుసిరెడ్డి పాండురంగారెడ్డి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. మధు–దివ్యల కుమారుడు జశ్వంత్(3) ఇటీవల బస్సు ఢీకొన్న ఘటనలో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకొని వారిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

చేనేత కార్మికులకు జియో ట్యాగ్ ఇవ్వాలి

చండూరు: అర్హులైన చేనేత కార్మికులందరికీ జియో ట్యాగ్ నంబర్లు కేటాయించాలని చేనేత పరిరక్షణ సేవా సమితి అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మంగళవారం చండూరులో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. చండూరులో కొందరు కార్మికులు మగ్గాలు కలిగి ఉన్నప్పటికీ జియో ట్యాగ్ నంబర్ లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే టై అండ్ డై చేస్తున్న కార్మికులకు కూడా జియో ట్యాగ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత పరిరక్షణ సేవా సమితి ఉపాధ్యక్షులు ఏలె శ్రీనివాస్, రాపోలు వెంకటేశం, సంగెపు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులు కర్నాటి శ్రీనివాసులు, చెరిపల్లి కృష్ణ, సహాయ కార్యదర్శులు వర్కాల విజయ్‌కుమార్, రావిరాల అశోక్, చెరిపల్లి నరేష్, కోశాధికారి కర్నాటి యాదయ్య, అధికార ప్రతినిధి రాపోలు జగదీశ్వర్, ముఖ్య సలహాదారు చెరుపల్లి వెంకటేశం, హైదరాబాద్ ఇన్‌చార్జ్ చిలుకూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పీజీ సెట్ ఫలితాల్లో ఎన్జీ విద్యార్థుల ప్రతిభ

రామగిరి(నల్లగొండ): తెలంగాణ స్టేట్ కామన్ పీజీ సెట్ ఎంట్రెన్స్–2023 ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని నాగార్జున(ఎన్జీ) డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో కళాశాలకు చెందిన విద్యార్థిని సుమ ఎంఎస్సీ జియాలజీ విభాగంలో రాష్ట్ర స్థాయి 1వ ర్యాంకు సాధించింది. జియాలజీలో భూపతి 10 ర్యాంకు, ఆర్కియాలజీలో లక్ష్మణ్ ప్రభు ఆకాష్ 13వ ర్యాంకు, ఫిజిక్స్‌లో శృతి 26వ ర్యాంకు సాధించారు. లైబ్రరీ సైన్స్‌లో శ్రావణి 27, జియాలజీలో భావన 27, స్టాటిస్టిక్స్‌లో అమూల్య 29, జియో ఇన్ఫర్మేషన్‌లో భూపతి 52వ ర్యాంకు సాధించారు. ఫిలాసఫీలో వెన్నెల 56, జాగ్రఫీలో సంజిత్ కుమార్ 73, జువాలజీలో మనీషా 77, కెమిస్ట్రీలో అన్నమయ్య 78వ, కంప్యూటర్ సైన్స్‌లో గౌతమ్ 84వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా కౌనిన్ బయోటెక్నాలజీలో 85, దుర్గాభవానీ హిస్టరీలో 100, శృతి బోటనీలో 122, సిద్ధిక్ ఎకనామిక్స్‌లో 130, మల్లిక మైక్రో బయాలజీలో 157వ ర్యాంకు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యామ్, వైస్ ప్రిన్సిపాల్ మునీర్, శ్రీనివాసులు, అధ్యాపకులు లైబ్రేరియన్ ఏ. దుర్గాప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

వృద్ధులకు సన్మానం


వృద్ధులను సన్మానిస్తున్న తహసీల్దార్ హరిబాబు

మిర్యాలగూడ టౌన్: వరల్డ్ సీనియర్ సిటిజన్ డే సందర్భంగా మంగళవారం మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో పలువురు వృద్ధులను తహసీల్దార్ హరిబాబు సన్మానించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ చీఫ్ నోడల్ అధికారి డి. ప్రతాప్‌నాయక్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కల్పన రవీందర్, సీనియర్ అసిస్టెంట్ జానీ షరీఫ్, జూనియర్ అసిస్టెంట్ అఫ్రోజ్, సిబ్బంది శ్రీహర్ష, మృదుల, స్వాతి, హారిక, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

భక్తిభావం పెంచుకోవాలి


విరాళం అందజేస్తున్న మన్నెం రంజిత్‌యాదవ్

త్రిపురారం: ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ అన్నారు. త్రిపురారం మండలం రాజేంద్రనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని బుడ్డితండాలో గల కనకదుర్గమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన రూ.5వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో హరియానాయక్, ధనావత్ సేవాలాల్‌నాయక్, నడ్డి లింగయ్యయాదవ్, పులిమాల కృష్ణారావు తదితరులు ఉన్నారు.

షోయబ్ ఉల్లాఖాన్‌కు ప్రజా సంఘాల నివాళి

దేవరకొండ: నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా అక్షర పోరాటం చేసిన జర్నలిస్టు షోయబ్ ఉల్లాఖాన్ 75వ వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం దేవరకొండ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రజా సంఘాల జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి వెంకటయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. షోయబ్ ఉల్లాఖాన్ రాసిన విశ్లేషణాత్మక రచనల గురించి ప్రస్తావించారు. కార్యక్రమంలో చొల్లేటి భాస్కరాచారి, చందునాయక్, బోయపల్లి చంద్రమౌళి, మేడ సైదులు, శేఖర్‌గౌడ్, శ్రీను, ఖైసర్, సలాం, ఇనాముల్లా తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

బీఆర్‌ఎస్ కార్యకర్తల సంబరాలు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరావుకు మరోసారి టికెట్ కేటాయించడంతో మంగళవారం ఆ పార్టీ కార్యకర్తలు మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్‌లో బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధికార ప్రతినిధి పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, అంజన్‌రాజు, చిన్న మల్లయ్యయాదవ్, కొండల్‌గౌడ్, దుర్గాచారి, కొత్త శ్రీనివాస్ తదితరులున్నారు.

కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ

మిర్యాలగూడ టౌన్: కుమ్మరి శాలివాహన సంఘం మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడిగా మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామానికి చెందిన బొడ్డుపల్లి లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. మంగళవారం నల్లగొండలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు చేతులమీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అంజిబాబు

మిర్యాలగూడ టౌన్: తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(టీఎన్‌టీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మిర్యాలగూడకు చెందిన ముక్కెర అంజిబాబు, ప్రచార కార్యదర్శిగా ఉప్పలపాటి గోపాలకృష్ణను నియమిస్తూ మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని టీడీపీ కార్యాలయంలో వారికి నియామక పత్రాలు అందజేశారు.

హైదరాబాద్‌కు తరలిరండి

మిర్యాలగూడ టౌన్: రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా డి. రాజేశ్వర్‌రావు ఈ నెల 24న బాధ్యతలు స్వీకరిస్తున్నందున క్రిస్టియన్ మైనార్టీలందరూ హైదరాబాద్‌కు తరలిరావాలని మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు బండారు అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు నాంపల్లిలోని గృహ కల్ప బిల్డింగ్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు.

గర్భిణులకు భోజనం ఏర్పాటు

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులకు డాక్టర్ ఉపేందర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా గర్భిణులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

నిధుల వివరాలు ఇవ్వాలని వినతి

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీకి జనవరి 2023 నుంచి ఇప్పటి వరకు సేట్‌ట్ ఫైనాన్స్ కమిషన్ 14 జనరల్ ఫండ్ ద్వారా విడుదలైన గ్రామాభివృద్ధి నిధులు, ఖర్చుల వివరాలు ఇవ్వాలని మండల బీజేపీ నాయకులు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి రామయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి గ్రామానికి వచ్చిన అభివృద్ధి నిధుల ఎంబీలు, గ్రామ సభలో తీర్మానం చేసిన కాపీలను ఇవ్వాలని కోరామన్నారు. కార్యక్రమంలో మహిళ మోర్చా జిల్లా కార్యదర్శి సింగం జ్యోతి, త్రిపురారం మండల బీజేపీ కార్యదర్శి దామెర సంతోష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి గండికోట గోపిచంద్, మహేశ్వరపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

101 కొబ్బరికాయలు కొట్టిన నాయకులు

హాలియా: నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నోముల భగత్‌కి సీఎం కేసీఆర్ రెండోసారి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఇవ్వడంతో హాలియా పట్టణ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రి మొగులయ్య ఆధ్వర్యంలో మంగళవారం స్థానికంగా ఆంజనేయస్వామి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా నోముల భగత్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని మొగులయ్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు రావులపాటి ఎల్ల య్య, గార్లపాటి ఎల్లయ్య, రావులపాటి లింగయ్య, లింగాల నగేష్, రావులపాటి వెంకటయ్య, పెరుమాల రాంబాబు, గురుజాల సైదులు, తుల రాజు, షేక్ పకీర్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో కొబ్బరికాయలు కొట్టిన మొగులయ్య, నాయకులు